


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 21 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 68 పేజీలు : 4 వెల : రూ 3-00


# ఏపీలో రాజకీయ రచ్చ



విజయవాడ, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)తమిళనాడు రాజకీయాలను తలదన్నే విధంగా ఏపీ రాజకీయాలు ఉంటున్నాయి. ఎవ్వరు కూడా తక్కేవేం కాదన్నట్లు కొనసాగుతున్నాయి ఏపీ పాలిటిక్స్. అటు టీడీపీ, ఇటు వైసీపీ నేతల మధ్య రోజుకో రచ్చ జరుగుతోంది. ఇరు పార్టీల మధ్య బూతు పురాణం కొనసాగుతోంది. అసలు విషయాలు పక్కనబెట్టి పనికి రాని విషయాలపై రచ్చ చేసుకుంటున్నారు. వైసీపీ నేతలు, టీడీపీ నేతలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కుంపటి పెట్టాయి.



పట్టాభి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో ఊగిపోయిన వైసీపీ కార్యకర్తలు కర్రలకు పని చెప్పారు. పట్టాభి ఇంటిపై దాడికి దిగారు. ఇంట్లో ఉన్న ఫర్నిచర్స్ అన్ని కూడా ధ్వంసం చేశారు. అంతేకాదు.. అటు కేంద్ర, రాష్ట్ర టీడీపీ కార్యాలయాలపై కూడా దాడులకు తెగబడ్డారు. కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్స్, అద్దాలు, కుర్చీలన్నీ ధ్వంసం చేశారు. అయితే పట్టాభి ఆ వ్యాఖ్యలు చేసిన వెంటనే ఎన్నో ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. ముఖ్యమంత్రి పదవిని గౌరవిస్తూ పార్టీ తరుపున క్షమాపణ చెప్పాలి. కానీ చంద్రబాబు అది చేయకపోగా వైసీపీ నేతలు తమను ఎన్ని మాటలు అన్నారని ఎదురు ప్రశ్నించడంతో పార్టీ నేతల నోళ్లు మరింతగా తెరుచుకున్నట్లయింది. సభ్యసమాజం తలదించుకునే విధంగా ఒక ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని తనను తాను ప్రశ్నించుకోలేకపోయారు చంద్రబాబు. పోలీసులను అని ప్రయోజనమేంటి?

అయితే పట్టాభి వ్యాఖ్యలతో కోపం కట్టలు తెంచుకున్న వైసీపీ కార్యకర్తలు.. తమదైన శైలిలో రెచ్చిపోయారు. ఇక వైసీపీ దాడులకు నిరసనగా నేడు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది తెలుగుదేశం పార్టీ. ఇలాంటి విషయాలలో రెండు పార్టీలు కూడా సంయమనం పాటించాల్సి ఉంటుంది. కానీ అలాంటివేమి జరగడం లేదు.ఏపీలో టీడీపీ ఇచ్చిన బంద్ ఆందోళనల మధ్య కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్ల నిరసనలు హోరెత్తిపోతున్నాయి. ఇక నిన్న జరిగిన ఘటనపై టీడీపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర స్థాయిలో మండిపతు న్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేత, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. జగన్ బ్యాంకులకు అప్పులు కట్టే పరిస్థితి లేదని, ఉద్యోగస్తులకు, నిరుద్యోగులకు, కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. విధి లేని పరిస్థితుల్లోనే దౌర్జన్యాలు చేస్తున్నారని, సీఎంను ప్రశ్నిస్తే ఇలాగే ఉంటుందనే హెచ్చరికగా నిన్న జరిగిన దాడులే



నిదర్శనమని అన్నారు. అవినీతీ, దౌర్జన్యం, హింసలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతగానితనంతోనే దాడులకు తెగబడుతున్నారని, చివరకు హత్యలు కూడా చేయించే పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. మంగళవారం జరిగిన దాడులను బీజేపీ ఖండిస్తోందని అన్నారు. వైసీపీ నేతల దౌర్జన్యం ఆపాలన్నారు. బద్వేల్‌లో భయభ్రాంతులకు గురి చేసేందుకు వైసీపీ నేతలంతా ఉన్నారని, బద్వేల్‌లో దౌర్జన్యం చేసి గెలవాలనుకుంటు న్నారని ఆరోపించారు. టీడీపీ కార్యాల యంపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. గతంలో జగన్ అసభ్యకరంగా మాట్లాడారని, మా జోలికి వస్తే ఇలాగే దాడులు చేస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి సుచరిత స్టేట్మెంట్ ఇవ్వడం ఏంటని ఆరోపించారు. ప్రశ్నిస్తే కేసులు, దౌర్జన్యాలు చేసి చంపేస్తారా.. అంటూ మండిపడ్డారు.

## కుషినగర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన మోదీ




లక్నో: బౌద్ధ తీర్థయాత్ర కేంద్రమైన ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్‌లో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారంనాడు దేశ ప్రజలకు అంకితం చేశారు. ఈ అంతర్జాతీయ విమాశ్రయాన్ని ప్రధాని మోదీ ప్రారంభించడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధులు బుద్ధభగవానుడు మహాపరినిర్వాణ స్థలాన్ని సందర్శించే సౌలభ్యం సుగమమవుతుంది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనంది బెన్ పటేల్, పౌర విమానయాన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, శ్రీలంక క్రీడా శాఖ మంత్రి నమల్ రాజపక్స తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రధాని మోదీ ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ విమానయాన రంగాన్ని ఎయిర్ ఇండియా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, సౌకర్యాలు, భద్రతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. కుషినగర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఏవియేషన్ రంగం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. మరి కొద్ది వారాల్లో ఢిల్లీ నుంచి కుషీనగర్‌కు నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్టు స్పైస్‌జెట్ తనకు తెలియజేసిందన్నారు. ఇది స్థానిక ప్రయాణికులకు, సందర్శకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. దశాబ్దాల ఆశలు, అంచనాలకు సాకారమే కుషీనగర్ అంతర్జాతీయ విమాశ్రయమని అన్నారు. ఈరోజు తన ఆనందం రెట్టింపయిందని పేర్కొన్నారు.కాగా, ఇండియా నుంచి అందుకున్న అతిపెద్ద బహుమతి బుద్ధిజం అని శ్రీలంక క్రీడా శాఖ మంత్రి నమల్ రాజపక్స అన్నారు. హిందూయిజం, బుద్ధిజం సహజీవనం సాగిస్తుంటాయని, లోతైన సంబంధ బాంధవ్యాలు కలిగి ఉన్నాయని, కుషీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఈ బాంధవ్యం మరింత పటిష్టం కానుందని చెప్పారు. కుషీనగర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అడుగుపెట్టే తొలి విమానం శ్రీలంక ఎయిర్‌లైన్స్‌దే కావడం చాలా సంతోషంగా ఉందని, ఇందుకు తమను ఆహ్వానించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలని అన్నారు. యూపీలోని లక్నోలో చౌదరి చరణ్ సింగ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, వారణాసిలో లాల్ బహదూర్ శాస్త్రి ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి అదనంగా ఇప్పుడు కుషీనగర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వచ్చి చేరడంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి మరింత పెరుగుతుందని, స్థానికులకు మరిన్ని ఉపాధి అవకాశాల కల్పనకు మార్గం సుగమం అవుతుందని యోగి సర్కార్ అంచనా వేస్తోంది.

## సంక్షేమ పాలనను చూసి టీడీపీ ఓర్వలేకపోతోంది: సీఎం జగన్

### 'జగనన్న తోడు' లబ్ధిదారుల ఖాతాల్లో రూ.16.36 కోట్లు జమ చేసిన సీఎం జగన్




అమరావతి: సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి.. కుల,మత, ప్రాంతం, పార్టీలతో నిమిత్తం లేకుండా పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 'జగనన్న తోడు' కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పాలనను చూసి టీడీపీ ఓర్వలేకపోతోందన్నారు.ప్రతిపక్షం ఎలా తయారయిందో ప్రజలు చూస్తున్నారు.బూతులు తిడుతూ ప్రతిపక్ష నేతలు రాజకీయాలు చేస్తున్నారు. ఎవరూ మాట్లాడని బూతులను ప్రతిపక్షం మాట్లాడుతోంది. గతంలో మేం కూడా ప్రతిపక్షంలో ఉన్నాం. ఇలాంటి బూతులు మేం ఎప్పుడూ మాట్లాడలేదు. టీడీపీ నేతలు కావాలనే వైషమ్యాలు సృష్టించి రెచ్చగొడుతున్నారు. ప్రతిమాటలోనూ, రాతలోనూ వంచన కనిపిస్తోంది. మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కూడా టీడీపీ వెనకాడదని సీఎం అన్నారు. 'జగనన్న తోడు' కార్యక్రమంలో భాగంగా లబ్ధి దారుల వడ్డీ సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. బుధవారం క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి రూ.16.36 కోట్లు లబ్ధి దారుల ఖాతాల్లో జమ చేశారు. తొలి విడత 'జగనన్న తోడు' కింద రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 4.5 లక్షల మంది చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటివరకు 9.05 లక్షల మందికి రూ.950 కోట్ల రుణాలను ప్రభుత్వం అందించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో చిరు వ్యాపారుల కష్టాలను కళ్లార చూశానని సీఎం అన్నారు. చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, హస్తకళా వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల కళాకారులకు 'జగనన్న తోడు' పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. వడ్డీ వ్యాపారుల చెర నుంచి చిరు వ్యాపారులకు ఈ పథకం ద్వారా విముక్తి కలుగుతుందన్నారు."ప్రతి ఒక్కరికీ ఏటా రూ.10వేల వడ్డీలేని రుణం అందిస్తున్నాం. ఇప్పటివరకు 9.05 లక్షల మందికి రూ.905 కోట్లు పంపిణీ చేశాం. ఇప్పటివరకు సకాలంలో చెల్లించిన 4.50 లక్షల మందికి రూ.16.36 కోట్ల వడ్డీ జమ చేస్తున్నాం. ఏడాదిలో రెండుసార్లు డిసెంబర్, జూన్‌లో 'జగనన్న తోడు' కార్యక్రమం నిర్వహిస్తాం. రుణాలు చెల్లించిన వారికి కొత్త లోన్లు ఇస్తాం. కొత్త రుణాలతో పాటు కట్టిన వడ్డీని వాపసు ఇస్తామని" సీఎం తెలిపారు.

## చేవెళ్ల నుంచి ప్రారంభమైన వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థానం



హైదరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం చేవెళ్ల నుంచి ప్రజాప్రస్థానం పేరిట పాదయాత్రను ప్రారంభించారు. వైఎస్ విజయమ్మ జెండా ఊపి పాదయత్రను ప్రారంభించారు. 400 రోజులపాటు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి తిరిగి చేవెళ్ల లోనే ముగించనున్నారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా 90 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టి వచ్చేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణలో వైఎస్సార్ పాలనను తీసుకురావడమే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు, వైఎస్సార్ అభిమానులు మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు.కాగా పాదయాత్రకు ముందు వైఎస్సార్‌టీపీ అధికార ప్రకటన చేసి వంద రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మహానేతకు ఘనంగా నివాళులు అర్పించారు. తన తల్లి విజయమ్మతో కలిసి షర్మిల ఇడుపులపాయలో దివంగత వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. ప్రార్థన సమయంలో తల్లి విజయమ్మ భావోద్వేగానికి లోనవ్వగా షర్మిల.. తన తల్లిని ఓదార్చారు. కాగా 2003లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇక్కడి నుంచే యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఇక ఇంతకముదు 2012లోనూ షర్మిల ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్ర నిర్వహించారు. 230 రోజులపాటు 116 నియోజకవర్గాల్లో 3,112 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఇక పార్టీ స్థాపించిన తరువాత తాజాగా యాత్రకు శ్రీకారం చుడుతున్నారు.

## పట్టాభి మాట్లాడింది.. దారుణమైన భాష: ఏపీ డీజీపీ

విజయవాడ: నిన్న టీడీపీ నేత పట్టాభి మాట్లాడింది.. చాలా దారుణ భాష అని ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నవారిపై దుర్భాషలాడటం సరికాదన్నారు. "పట్టాభి వ్యాఖ్యల తర్వాత ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఒక పార్టీ కార్యాలయంలో కూర్చుని ఇంత దారుణంగా మాట్లాడటం సరికాదు. ఇలాంటి భాషను సమాజంలో ఎవరూ అంగీకరించరు. పట్టాభి మాట్లాడిన భాష గతంలో ఎన్నడూ వినలేదు. రాజకీయ పార్టీలకు బాధ్యత ఉండాలని డీజీపీ హితవు పలికారు. నిన్న పట్టాభి చేసిన వ్యాఖ్యలు అన్ని పరిధులు దాటాయి. ఒక్కసారి కాదు.. పదేపదే పట్టాభి దూషణలు చేశాడు. పట్టాభి వ్యాఖ్యలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తాం. గత కొన్ని రోజులుగా చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తాం. దీని వెనుక ఎలాంటి కుట్ర ఉన్నా దర్యాప్తులో బయటపెడతాం. నిన్న సాయంత్రం 5.03 నిమిషాలకు వాట్సాప్‌లో ఒక కాల్ వచ్చింది. కాల్ చేయగానే ఎస్పీ తక్షణమే స్పందించారు.నిరాధార ఆరోపణలు కరెక్టు కాదని డీజీపీ అన్నారు. విజయవాడకు డ్రగ్స్‌తో ఏమాత్రం సంబంధం లేదన్నారు. అయినా కొందరు కావాలని ఆరోపణలు చేస్తున్నారన్నారు. స్పష్టంగా చెప్పినా పదేపదే ఆరోపణలు సరికాదన్నారు. ఆరోపణలు చేయవద్దని చెబుతున్నాం. గుజరాత్‌లో దొరికిన డ్రగ్స్‌తో ఏపీకి సంబంధం లేదు. ఒక గ్రామ్ కూడా విజయవాడకు రాలేదన్నారు.విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాన్ని మరువలేమని డీజీపీ అన్నారు. ఎలాంటి క్లిష్ట సమయంలోనైనా పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. రేపు పోలీసు ఫ్లాగ్ డే నిర్వహిస్తామన్నారు. కోవిడ్‌లో క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్నామని డీజీపీ అన్నారు.



## సీఎం జగన్‌ను చంద్రబాబు ఇంచుకూడా కదపలేరు: కొడాలి నాని

తాడేపల్లి: ప్లాన్ ప్రకారమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మంత్రి కొడాలి నాని విమర్శించారు. సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తాటా తీస్తామని హెచ్చరించారు. పట్టాభి కూడా డబ్బులు తీసుకొని తిడుతున్నాడన్నారు. వైఎస్సార్సీపీ శ్రేణులను కావాలనే రెచ్చగొట్టారని మండిపడ్డారు. చంద్రబాబువి మొదటి నుంచి మోసపూరిత రాజకీయాలే అని దుయ్యబట్టారు. చంద్రబాబులాంటి వాళ్లు ఎంతమంది వచ్చినా ఏం కాదని, సీఎం వైఎస్ జగన్‌ను ఇంచు కూడా చంద్రబాబు కదపలేరని స్పష్టం చేశారు.చంద్రబాబులా పెయిడ్ ఆర్టిస్ట్‌లను పెట్టి తిట్టించడం తమకు రాదని మంత్రి కొడాలి నాని స్పష్టం చేశారు. వ్యూహం ప్రకారమే డ్రగ్స్‌పై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అమిత్‌షాపై తిరుపతిలో చంద్రబాబు రాళ్లతో దాడి చేయించారని, చంద్రబాబు ఎలాంటి వ్యక్తో అమిత్‌షా, మోదీలకు ఎప్పుడో తెలుసన్నారు. ఇప్పుడు ఏం ముఖం పెట్టుకొని అమిత్‌షాను కలుస్తావని ప్రశ్నించారు. చంద్రబాబు చేసేవన్నీ నీచ రాజకీయాలేనని, ఆయన చేసే కొంగ జపాలను ఎవరూ నమ్మరని



అన్నారు.'ఏపీలో ఏదో జరిగిపోతోంది. శాంతిభద్రతలు లేవు. దేశానికి మాదకద్రవ్యాలను సీఎం జగన్ సప్లై చేస్తున్నాడనే ప్రచారం కోసం టీడీపీ ప్రయత్నం చేసింది. టీడీపీ నాయకులు గత 10 రోజుల నుంచి తాడేపల్లి నుంచి గంజాయి వైఎస్ జగన్ ప్రపంచానికి సరఫరా చేస్తున్నాడంటూ పిచ్చి వాగుడు వాగుతున్నారు. రాజశేఖర్ రెడ్డిని ముఠా నాయకుడని, అవినీతిపరుడని అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టాలని చంద్రబాబు ప్రయత్నం చేశారు. వైఎస్ జగన్ నూనూగు మీసాల వయసు నుంచి ఆయనపై కుట్రలు చేయడం ప్రారంభించారు. ఈ రోజు అత్యధిక మెజారిటీతో గెలిస్తే ఏదో రకంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తున్నారు.

## దాడిని నిరసిస్తూ చంద్రబాబు 36 గంటల నిరసన దీక్ష



అమరావతి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 36 గంటల పాటు నిరసన దీక్ష చేపట్టనున్నారు. నిన్న ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కార్యాలయాలపై జరిగిన దాడికి నిరసనగా గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం రాత్రి 8 గంటల వరకు దీక్షలో కూర్చోనున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన సామగ్రి మధ్యలోనే దీక్షలో దిగనున్నారు. మరో వైపు రాష్ట్రంలో పరిస్థితులపై కేంద్రానికి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరారు. కేంద్ర హోంశాఖ మంత్రిని కలిసి టీడీపీ కార్యాలయంలో జరిగిన దాడులపై ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నది.

# సంపాదకీయం

గురువారం 21 అక్టోబరు 2021

## ముంచుకొస్తున్న ముప్పు

ఉత్తర ధృవం ఇప్పుడు భూమిని భయపెడుతోంది. గతేడాది మేలో ఆర్కిటిక్‌లోని అత్యంత పురాతన మంచు పలకలో ఓ భారీ గొయ్యి ఏర్పడింది. ఇది ప్రపంచానికి ఆందోళన కలిగించే పరిణామమేనని సైంటిస్టులు అంటున్నారు. ప్లాస్టిక్ వాడకం..పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులు..ఇతర కారణాలతో భూగోళం అగ్నిగోళంగా మారిపోతోందా? భూతాపం పెరిగిపోతోందా? దీంతో పెను విపత్తుముంచుకొస్తోందా? భూగ్రహం మహావిపత్తుకు అంచున ఉందా? అంటే నిజమేనంటోంది ఐక్యరాజ్యసమితి. ఈ శతాబ్దం చివరి నాటికి భూమి ఉష్ణోగ్రతల్లో 2.7 డిగ్రీలు పెరుగే అవకాశముందని..దీంతో జీవరాశికి పెను విపత్తు ముంచుకురానుందని హెచ్చరిస్తోంది. ఐక్యరాజ్యసమితి తాజాగా విడుదల చేసిన నివేదిక హెచ్చరికలు వింటుంటే వెన్నులోంచి వణుకు పుట్టుకొస్తుంది. యూఎన్ ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ భూతాపానికి సంబంధించి తాజా నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం ఈ శతాబ్దం చివరి నాటికి ఉష్ణోగ్రతలు 2.7 డిగ్రీలు పెరుగుతాయని హెచ్చరించింది. అయితే, భూతాపాన్ని తగ్గించాలంటే ఉష్ణోగ్రతల సగటు పెరుగుదలను 1.5 డిగ్రీల లోపే ఉండేలా చూడాలని శాస్త్రవేత్తలు చెబుతూ వస్తున్నారు.కారణంగా ఆ మంచు పలక విరిగిపోయి, ఆ మంచు పూర్తిగా కరిగి సముద్రాల్లో కలుస్తుందని, దీనివల్ల నీటి మట్టాలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. పోలిన్యాగా పిలవబడే ఈ భారీ గొయ్య 1988, 2004లోనూ కనిపించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. దీనికి సంబంధించి అధ్యయనాన్ని జియోఫిజికల్ రీసెర్చ్ లెటర్స్‌లోనూ ప్రచురించారు.కెనడాకు సమీపంలోని మంచు పలకలో ఈ భారీ గొయ్యి ఏర్పడింది. ఇది 100 కి.మీ. మేర విస్తరించి ఉంది. ఉత్తర ధృవంలో పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఇక్కడి మంచు ప్రమాదంలో పడింది. ఈ శతాబ్దం చివరిలోగా ఇక్కడి చివరి మంచు పలక కూడా పూర్తిగా కరిగిపోయే ప్రమాదం ఉన్నదని, ఇది ఆర్కిటిక్, ఉత్తర ధృవాల్లో నివసిస్తున్న జీవరాశుల అంతానికి కారణమవుతుందని సైంటిస్టులు హెచ్చరించారు. గతేడాది మేలో వచ్చిన ఓ భారీ తుఫాను కారణంగా ఈ గొయ్యి ఏర్పడినట్లు వాళు చెప్పారు. ఈ గొయ్యికి సంబంధించిన ఫొటోలను శాటిలైట్ ద్వారా తీశారు.పురాతన మంచు పలకలో భారీ గొయ్యి కారణంగా పగుళ్ల ఏర్పడ్డాయి. ఆ పగుళ్ల క్రమేపి ఆ మంచు పలక విరిగిపోవడానికి కారణమయ్యాయి. మంచు పలక పగిలి పూర్తిగా కరిగి సముద్రాల్లో కలుస్తుందని, దీనివల్ల సముద్ర నీటి మట్టాలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. ఇది ప్రపంచానికి ఆందోళన కలిగించే పరిణామమే అని చెబుతున్నారు.ఉత్తర ధ్రువంలో పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఇక్కడి మంచు ప్రమాదంలో పడింది. కెనడాకు సమీపంలో ఉన్న ఈ మంచు పలకలో 100 కి.మీ. మేర భారీ గొయ్యి ఏర్పడింది. ఈ శతాబ్దం చివరిలోపు ఇక్కడి చివరి మంచు పలక కూడా పూర్తిగా కరిగిపోయే ప్రమాదం ఉందని, ఇది ఆర్కిటిక్, ఉత్తర ధ్రువాల్లో నివసిస్తున్న జీవరాశుల అంతానికి కారణమవుతుందని సైంటిస్టులు హెచ్చరించారు.ఈ నివేదికను చూస్తుంటే భూమి మహావిపత్తు వైపు శరవేగంగా దూసుకుపోతోందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉష్ణోగ్రతలు 2.7 డిగ్రీలు పెరగడమంటే సామాన్యమైన విషయం కాదని ఇది భూమికి పెను విపత్తేనని ఆందోళన వ్యక్తంచేశారు. 1.5 డిగ్రీల దగ్గరే ఉంచుతామని ఆరేళ్ల క్రితం పారిస్ ఒప్పందం హామీ గాల్లో కలిసిపోయినట్టేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనుకున్నలక్ష్యాన్ని అందుకోలేకపోతే భూమ్మీద జీవరాశి వినాశనానికి తప్పదని హెచ్చరించారు. భూ ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి మన దగ్గర అన్ని ఆయుధాలున్నా..దానికి తగిన సమయంలో మాత్రం లేదని..సమయం తగ్గిపోతోంది కానీ తీసుకోవాల్సిన చర్యలు మత్రం జరగటంలేదని అన్నారు.రోజురోజుకు పెరిగిపోతున్న గ్లోబల్ వార్మింగ్ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వినాశనకరమైన వాతావరణ ఘటనలకు కారణమవుతున్నాయని..ఆర్థిక వ్యవస్థలు సమాజాలపై పెరుగుతున్న ప్రభావాలతో అధిక వేడి పెరిగిపోతోందని తెలిపారు.గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వావారణంలో తీవ్ర మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. పలు ప్రాంతాల్లో కార్చిచ్చులు చెలరేగి వేలాది హెక్టార్లలో అడవులు అగ్నికి ఆహుతి అయిపోతోందని..వరదు విరుచుకుపడి ప్రాణ, ఆస్థి నష్టాలు ఏర్పడుతున్నాయన్నారు. దీంతో ఆర్థిక కష్టాలు పెరుగుతున్నాయని యూఎన్ చీఫ్ తెలిపారు.1970లో సంభవించిన వాతావరణ విపత్తుల కంటే ఐదు రెట్లు ఎక్కువ విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. దీని వల్ల ఏడు రెట్లు నష్టాలు జరుగుతున్నాయన్నారు. అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయని న్యూయార్క్ నగరంలో వరదలతో అల్లాకల్లోలం అయిపోగా 50మంది చనిపోయారని ఇది వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పులు కారణమేనని అన్నారు.

# టీడీపీ, వైసీపీ మధ్య అగ్గి



విజయవాడ, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)ఏపీలో రాజకీయాలు అట్టుడుకుతున్నాయి. టీడీపీ, వైసీపీ మధ్య అగ్గి రాజుతోంది. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పట్టాభి ఇంటిపై వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు దాడి నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు భగ్గుమన్నాయి. దీంతో రేపు రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది రాష్ట్ర తెలుగుదేశం పార్టీ. టీడీపీ, వైసీపీ నేతలు ఘర్షణకు దిగారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అదనపు పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. రెచ్చగొట్టే వ్యాఖ్యాలపై ఆవేశాలకు గురికావొద్దని, అందరు కూడా సంయమనం పాటించాలని ఏపీ డీజీపీ కార్యాలయం హెచ్చరించింది. రెచ్చగొట్టె వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపింది.విజయవాడలోని పట్టాభి ఇంట్లోకి ప్రవేశించిన కార్యకర్తలు సామగ్రి ధ్వంసం చేశారు. పట్టాభి నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌ను ఉద్దేశించి కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబుకు విశాఖ నర్సీపట్నం పోలీసుల నోటీసులు ఇవ్వడాన్ని తప్పుబడుతూ పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వంపై పట్టాభి ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశం అనంతరం సీఎంపై వ్యాఖ్యలకు నిరసనగా.. వైఎస్ఆర్ సీపీకి చెందిన కొందరు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశారు. ఈ దాడిలో ఇంట్లో ఉన్న ఫర్నిచర్ ధ్వంసం అయింది.రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య ఘర్షణ నేపథ్యంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై కూడా దాడి చేశారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లోని టీడీపీ కార్యాలయాలు, నేతల ఇళ్లను కూడా ముట్టడించారు. కాగా.. కేంద్ర కార్యాలయంపై దాడి అనంతరం.. అక్కడికి చేరుకొని టీడీపీ అధినేత చంద్రబాబు పరిశీలించారు. ఘటనకు సంబంధించి పార్టీ శ్రేణులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, వర్ల రామయ్య, అశోక్‌బాబు, పట్టాభి తదితరులు పార్టీ కార్యాలయానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. దాడికి నిరసనగా బుధవారం రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చింది. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పట్టాభి సీఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు పలుచోట్ల టీడీపీ కార్యాలయాలు, నేతల ఇళ్లపై దాడులు చేశారు. విజయవాడలోని పట్టాభి ఇంట్లోకి ప్రవేశించిన వైసీపీ కార్యకర్తలు సామగ్రి ధ్వంసం చేశారు. దీంతోపాటు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై కూడా దాడి చేశారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లోని టీడీపీ కార్యాలయాలు, నేతల ఇళ్లను కూడా ముట్టడించారు. కాగా.. కేంద్ర కార్యాలయంపై దాడి అనంతరం.. అక్కడికి చేరుకొని టీడీపీ అధినేత చంద్రబాబు పరిశీలించారు. ఘటనకు సంబంధించి పార్టీ శ్రేణులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, వర్ల రామయ్య, అశోక్‌బాబు, పట్టాభి తదితరులు పార్టీ కార్యాలయానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.టీడీపీ నేతలు, కార్యాలయాలపై పక్కా ప్రణాళిక ప్రకారం దాడులు చేయిస్తున్నారని చంద్రబాబు అమిత్‌షాకు ఫిర్యాదు చేశారు. దాడి విషయం తన దృష్టికి రాలేదని అమిత్ షా తెలిపినట్లు సమాచారం. పార్టీ ప్రధాన కార్యదర్శి ద్వారా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని అమిత్ షా హామీ ఇచ్చారని పేర్కొంటున్నారు. టీడీపీ కార్యాలయానికి, నేతల ఇళ్లకు కేంద్ర భద్రతాబలగాల రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఏపీ పోలీస్ అధికారులతో మాట్లాడతానని అమిత్‌షా చంద్రబాబుకు హామీ ఇచ్చినట్లు సమాచారం.

# విశాఖ-చెన్నై కారిడార్ పై తీవ్ర అసంతృప్తి

విజయవాడ, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ పై రుణ సంస్థ ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టు రేటింగ్ ప్రమాదంలో (ఎట్ రిస్క్) ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఘాటు లేఖ రాసినట్టు సమాచారం. ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొంటున్న కాంట్రాక్టు సంస్థల నుంచి తమకు నేరుగా ఫిర్యాదులు వస్తున్నట్లు వివరించింది. ప్రధానంగా రాచగన్నేరి, నాయుడుపేట, ఏర్పేడు ప్రాంతాల్లో పనులు నిర్వహిస్తున్న కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ సంస్థ బకాయిలపై తమకు ఫిర్యాదు చేసిందని వివరించింది. త్వరలో ఈ సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేసింది.సుమారు 280 కోట్ల డాలర్లు (రూ.21 వేల కోట్లు) అంచనాతో నిర్మితమయ్యే విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి ఎడిబి 62.5 కోట్ల డాలర్లు (రూ.4,700 కోట్లు) పరిశ్రమల శాఖ ద్వారా రుణం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులో పనిచేసిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన నిధులను సకాలంలో చెల్లించడం లేదనీ, ఎపి సర్కారు బకాయిలు పెడుతునుదని ఎడిబి గుర్తించింది. ఈ మేరకు గత జూలై, ఆగస్టు నెలల్లో రాష్ట్రానికి లేఖలు రాసినప్పటికీ ఫలితం కనిపించలేదని తాజా లేఖలో పేర్కొంది. కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లకు17 మిలియన్ డాలర్ల (రూ.127 కోట్లు) బకాయిలు ఉన్నాయని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను జత చేయకపోవడం వల్లనే నిధుల పంపిణీలో జాప్యం జరుగుతోందని గుర్తించినట్లు పేర్కొంది. త్రైపాక్షిక ఒప్పంద సమావేశంలో కూడా ఇదే అంశంపై చర్చించామని, నిధుల విడుదలపై పూర్తి నివేదిక ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చినప్పటికీ, ఇప్పటి వరకు తమకు అది చేరలేదని ఎడిబి పేర్కొంది.

ఈ పరిస్థితుల్లో కొనసాగుతున్న విసిఐసి తొలి దశపై ప్రభావం పడుతోందని, దీనికి తోడు రెండో దశపైనా ప్రభావం ఉంటుందని ఆరదోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే తొలిదశ ప్రాజెక్టుకు'ఎట్ రిస్క్' రేటింగ్ ఇవ్వడం జరిగిందని వివరించింది. ఆర్థిక నిర్వహణ సమస్యలు, నిధుల పంపిణీ తక్కువగా ఉండడం వల్లనే ఈ రేటింగ్ ఇవ్వాల్సి వచ్చిందని పేర్కొంది. ఇప్పటికైనా ఈ అంశాలను పరిష్కరించి ప్రాజెక్టు సజావుగా సాగేలా చూడాలని సూచించింది. విసిఐసి నిర్మాణానికి రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చవలసివుంది. ఈ బకాయిల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఎంతో రాష్ట్ర ప్రభుత్వమే వెల్లడించాలి.

# ఓ... అమరుడా... మరువలేని మహనీయుడా...

**గత చరిత్ర ను , మన పూర్వీకుల అనుభవాలను నెమరువేసుకుంటూ ఆనందం గా జీవితం గడపడానికే ఉత్సవాలు చేస్తూ ఉంటాము . సమాజానికి ఒక నిర్ధేశిత సందేశము ఇవ్వడానికి దినోత్సవాలు చేస్తూఉంటాం . సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం పండుగలు చేస్తాము . ఏది చేసినా ఎక్కడ చేసినా ప్రపంచ మానవాలి శ్రేయస్సు కోసమే నిర్ధేశించబడుతుంది .పుట్టిన రోజు, పెళ్లి రోజు, అమ్మల రోజు, నాన్నల రోజు మరియు ప్రేమికుల రోజు. ఈ రోజుల్లో మనం ప్రత్యేకంగా వారి గురించి అలోచించి, వాళ్ళను కొనియాడి, మన బాధ్యతను గుర్తు చేసుకొంటాము. మరి (అక్టోబర్ 21) -పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం గురించి అలోచించి మన బాధ్యతలేమిటో తెలుసుకుందాము**


అక్టోబర్ 21వ తేదీ పోలీసు శాఖలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న దినం. భారత చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో గల హాట్ స్ప్రింగ్స్ అనే ప్రదేశంలో 1959 అక్టోబర్ 21న చైనా సైనికులు దాడి చేసిన సంఘటనలో 10 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్‌లు నేలకొరిగారు. అప్పటి నుంచి వారిని స్మరించుకుంటూ ప్రతి యేటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల స్మారక దినంగా జరుపు కుంటూరు .విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీసు శాఖ పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుంది. విధి నిర్వహణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన వారికి యావత్ పోలీసు శాఖ ఘనంగా నివాళులు అర్పించి, వారి ఆశయ సాధన కోసం పని చేస్తామని ప్రతిన భూనడానికి పోలీసుల అమరవీరుల దినోత్సవం వేదికగా నిలుస్తోంది.రక్షకభటులు తమ ప్రాణాలకు తెగించి సమాజ రక్షణకు పాటుపడుతూ ఉంటారు. ఖాకీ యూనిఫాంలో ప్రజలకు సహజమిత్రులుగా కనిపించే పోలీసులను చూస్తే కొండత ధైర్యం ఆపదలో వున్నవారికి కలుగుతుంది. పోలీసులు కూడా కట్టుకున్న వారిని, కన్న పిల్లలను విడిచి విధి నిర్వహణ పరమావధిగా భావిస్తూ ప్రాణాలను తణప్రాయంగా త్యాగించి సంఘటనలు కోకొల్లలుగా వుంటాయి. అమరజవానుల బలిదానంను స్మరించుకోవలసిన క్షణాలు ఇవి. చైనా యుద్ధం నుంచి నేటి అతర్గత భద్రత కోసం సాయుధసంఘర్షణలో ప్రతి నిత్యం చావుబ్రతుకుల మధ్య పోరాటం



**ప్రపంచం అంతా నిద్రించినన... నిత్యం మేల్కొనే పోలీసా...**

**ప్రతీ క్షణం ... నిఘా నీడలో అలుపెరుగని పోలీసన్న..**

**జోహార్..జోహార్... జోహార్. పోలీసన్న... జోహార్**




సాగిస్తూనే వున్నారు. ధర్మ సంరక్షణార్థం సమాజ వనానికి కంచెలుగా నిలిచి నిలువెత్తు ప్రాణాలను తృణపాయంగా అర్పించిన వారి సేవలకు నివాళులర్పించాల్సిన రోజే అమరవీరుల సంస్మరణ దినోత్సవం. వేసుకున్న ఖాకి దుస్తుల చాటున కారుణ్యం, కన్నీరు దాగి ఉన్న వత్తి ధర్మానికి తలొగ్గి ధైర్యసహసాలు ప్రదర్శించి వారి ప్రాణాలను తణ ప్రాయంగా పెట్టి ప్రజా రక్షణలో అమరులైన పోలీసులకు జోహార్లు. అసాంఘిక శక్తులను అనిచివేయడానికి పోలీసులు నిరంతరం కషి చేస్తూ విధి నిర్వహణలో సమిదలవుతున్నారు.

**పోలీసు అమరవీరుల దినోత్సవ ఆవిర్భావం ఇలా :** భారత చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో గల హాట్ స్ప్రింగ్స్ అనే ప్రదేశంలో 1959 అక్టోబర్ 21న చైనా సైనికులు దాడి చేసిన సంఘటనలో 10 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్‌లు నేలకొరిగారు. అప్పటి నుంచి వారిని స్మరించుకుంటూ ప్రతి యేటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల స్మారక దినంగా జరుపుకుంటూ దేశ వ్యాప్తంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు.

**త్యాగాలకు ఫలితం శూన్యం :** అనునిత్యం అప్రమత్తంగా ఉండి శాంతి భద్రతలను కంటికి రెప్పలా కాపాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాలకు తగిన సహాయం అందించటలో ప్రభుత్వాలు విఫలమయ్యాయంటూ అమర వీరుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్మరణ దినం రోజు మాత్రమే గుర్తుకు వస్తున్నామని మళ్లీ ఏడాది వరకు తమ కుటుంబాలను పట్టించుకునే వారు ఉండరని బోరున విలపిస్తున్నారు. కొందరికి ఆర్థిక సహాయం అందకపోగా మరికొందరికి ఉద్యోగం ఇవ్వలేదని, మరికొందరి పిల్లలకు ఉన్నత చదువులకు సహాయం అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. నక్సలైట్ల దాడిలో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందే సహాయం నేటి వరకు అందలేదన్నది నిజం. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలను అర్పించిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికైనా ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. తీవ్రవాద, ఉగ్రవాద దాడులతో పాటు అసాంఘిక శక్తుల దాడిలో విధి నిర్వహణలో వీరమరణం పొందిన వారిని సదా స్మరించుకుందాము .

# మళ్లీ తెరపైకి కాపు ఉద్యమం

కాకినాడ, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)కాపు రిజర్వేషన్ల ఉద్యమం మరోసారి ప్రారంభమయ్యేటట్లే కన్పిస్తుంది. ఎన్నికలు ఇంకా మూడేళ్ల సమయం ఉండటం, పవన్ కల్యాణ? కు అండగా నిలబడాల్సి ఉండటంతో మరోసారి కాపు రిజర్వేషన్ల ఉద్యమం ఊపందుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇటీవలే పవన్ కల్యాణ్ కాపు, ఒంటరి, బలిజలు ఏకమై లీడ్ చేయాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనికి కాపు పెద్దలు పూనుకోవాలని కూడా ఆయన పిలుపునిచ్చా రు.దీంతో కాపు రిజర్వేషన్లను మరోసారి తెరపైకి తెచ్చే ప్రయత్నం జరుగుతుంది. నిన్న మొన్నటి వరకూ కాపు రిజర్వేషన్ల పోరాటాన్ని ముద్రగడ పద్మనాభం నిర్వహించేవారు. ఆయన ఆధ్వర్యంలో పెద్దయెత్తున ఆందోళనలు జరిగాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ముద్రగడ పద్మనాభం వ్యవహరించారన్న విమర్శలూ లేకపోలేదు. తుని సంఘటనతో కాపుల్లో అప్పటి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది.ఆ కారణంగానే 2019 ఎన్నికల్లో కాపులు టీడీపీకి దూరమయ్యారన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ కూడా కాపు రిజర్వేషన్లపై ఒక స్టాండ్ తీసుకోకపోవడంతో వారంతా వైసీపీకి దగ్గరయ్యారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ పిలుపు మేరకు కాపు సంక్షేమ సేన సమాయత్తమవుతుంది. కార్యాచరణకు సిద్ధమయింది. తొలుత పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రికి పోస్టు కార్డుల ద్వారా ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యిమంది కాపు రిజర్వేషన్ల ఆవశ్యకత గురించి తెలియజేయాలన్నారు.అయితే కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్థులను ఏకం చేసే పనిని హరిరామ జోగయ్య ఉన్నారు. ప్రభుత్వంపై ఈ మూడేళ్లు పోరాటం చేసి పవన్ కల్యాణ్ కు అనుకూలంగా మార్చాలన్నది ఆయన ఉద్దేశ్యంగా ఉంది. కాపు రిజర్వేషన్లు సాధ్యం కాదని, అది కేంద్రం చేతిలో ఉందని జగన్ చెప్పారు. కానీ రాజకీయంగా పవన్ కల్యాణ? కు లబ్ది చేరేందుకు కాపు సంక్షేమ సేన, జనసేనకు అండగా ఉండే ప్రయత్నంలో ఉందనే చెప్పాలి

# అశోక్ రెడ్డికి శోకమేనా

ఒంగోలు, అక్టోబరు 20,(న్యూస్ పల్స్)వైసీపీలోకి రావాలనుకున్నారు. కానీ కుదరలేదు. జగన్ అంగీకరించలేదు. దీంతో ఆయన టీడీపీలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నట్లుంది. 2014లో వైసీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో 23 మంది టీడీపీలోకి వెళ్లిపోయారు. వారిలో కొందరికి చంద్రాబాబు 2019 ఎన్నికల్లో సీట్లు కూడా ఇవ్వలేదు. మరికొందరికి ఇచ్చారు. అందులో ముత్తముల అశోక్ రెడ్డి ఒకరు. గిద్దలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి వైసీపీ నేత అన్నా రాంబాబు చేతిలో ఓటమి పాలయ్యారు. అన్నా రాంబాబు టీడీపీ నుంచి ఎన్నికలకు ముందు వైసీపీలోకి వచ్చారు.అయితే 2019 ఎన్నికల తర్వాత ముత్తముల అశోక్ రెడ్డి తిరిగి వైసీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో చర్చలు కూడా జరిపారు. కానీ తనను మధ్యలో వదిలేసి వెళ్లిపోయిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకోలేదని జగన్ తెగేసి చెప్పినట్లు తెలిసింది. ఇతర పార్టీలో ఉన్న వారినైనా తీసుకుంటాం కాని, ఒకసారి మోసం చేసి వెళ్లిన వారిని తిరిగి తీసుకోమని జగన్ స్పష్టం చేసినట్లు సమాచారం.ఈ సంగతి తెలుసుకున్న చంద్రబాబు గిద్దలూరు నియోజకవర్గం పార్టీ బాధ్యతలను వేరే వారికి అప్పగించాలని సిద్ధమయ్యారు. పిడతల సాయికల్పనా రెడ్డికి ఇవ్వాలని చంద్రబాబు భావించారు. కానీ ముత్తముల అశోక్ రెడ్డి వైసీపీ గేట్లు తెరుచుకోక పోవడంతో తిరిగి యాక్టివ్ అయ్యారు. టీడీపీలోనే కొనసాగాలని నిర్ణయించుకున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పొత్తు ఉండే అవకాశం ఉండటంతో ఆయన టీడీపీ నుంచే వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగాలని డిసైడ్ అయ్యారు.గిద్దలూరు నియోజకవర్గం 2009లో ప్రజా రాజ్యం పార్టీ గెలచింది. అప్పుడు అన్నా రాంబాబు గెలిచారు. దీంతో ఇప్పుడు ముత్తముల అశోక్ రెడ్డి తన సామాజికవర్గం ఓట్లతో పాటు ఇటు జనసేన ఓటింగ్ కలిస్తే సులువుగా విజయం సాధ్యమవుతుందని భావిస్తున్నారు. కానీ ఒకవేళ పొత్తు కుదిరితే గిద్దలూరు నియోజకవర్గాన్ని జనసేన కోరే అవకాశం లేకపోలేదు. ప్రకాశం జిల్లాలో కొద్దోగొప్పో బలం ఉన్న నియోజకవర్గం అదొక్కటే. అందుకే ముత్తముల అశోక్ రెడ్డి టీడీపీ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. మరి చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

# జూనీయర్ ఎన్టీఆర్ కోసం దశలవారీగా ప్రయత్నాలు

విజయవాడ, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)అంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ పరిస్థితి బాగాలేదు. చంద్రబాబు, లోకేష్ మాటలను ప్రజలు విశ్వసించడం లేదు. ఎన్నికల హామీ ఇచ్చినా జనం వాటిని సీరియస్ గా తీసుకుంటారన్న గ్యారంటీ లేదు. అయితే ఈసారి గెలుపు టీడీపీకి అవసరం. లేకుంటే పార్టీ మనుగడే కష్టమవుతుంది. అందుకే అన్ని కోణాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా జూనియర్ ఎన్టీఆర్ ను పార్టీ ప్రచారానికి తీసుకు వచ్చే ప్లాన్ చేస్తున్నారు.జూనియర్ ఎన్టీఆర్ పూర్తిగా సినిమాలకే పరిమితమయ్యారు. ఆయనకు సినిమాల్లో మంచి భవిష్యత్ ఉంది. రాజకీయాలు అంటే ఆయనకు అసలు పడటం లేదు. దీంతో ఎన్నిసార్లు మీడియా ప్రశ్నించినా ఇది సమయం కాదని దాటవేస్తూ జూనియర్ ఎన్టీఆర్ తప్పించుకుంటున్నారు. అయితే ఆయనకు తెలుగుదేశం పార్టీ అంటే వల్లమాలిన ప్రేమ. తన తాత స్థాపించిన పార్టీ పది కాలాల పాటు బాగుండాలని జూనియర్ ఎన్టీఆర్ కోరుకుంటారు.అదే బలహీనతను ఇప్పుడు చంద్రబాబు సొమ్ము చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఎక్కడకు వెళ్లినా జూనియర్ ఎన్టీఆర్ రావాలని చంద్రబాబు ఎదుటే ప్లకార్డులు కన్పిస్తున్నాయి. దీంతో ఆయన పక్కాగా జూనియర్ ను రింగ్ లోకి లాగేందుకు సిద్దమయ్యారు. ముఖ్యంగా జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సినీ పరిశ్రమ మరింత కష్టాల్లో పడింది. సినిమా టిక్కెట్లు ప్రభుత్వమే సొంతంగా విక్రయించాలనుకోవడం, బెనిఫిట్ షో, స్పెషల్ షోలను రద్దు చేయడం వంటివి చిత్ర పరిశ్రమకు నచ్చడం లేదు. దీంతో కొందరు సినీ ప్రముఖులను జూనియర్ ఎన్టీఆర్ వద్దకు పంపాలని నిర్ణయించారని తెలిసింది. సినీ పరిశ్రమలో ఇప్పటికీ కొందరు పెద్దల మాటను జూనియర్ గౌరవిస్తారు.ఇక రాజకీయంగా కూడా కొందరు పెద్దలను చంద్రబాబు జూనియర్ ఎన్టీఆర్ వద్దకు పంపాలని నిర్ణయించుకున్నారు. విడతల వారీగా ఈ కార్యక్రమం ఉంటుంది. కమ్మ సామాజికవర్గానికి చెందిన పారిశ్రామికవేత్తలు, సీనియర్ ఎన్టీఆర్ తో అనుంబధం ఉండి పార్టీ పెట్టి ఇప్పుడు కాలక్షేపం చేస్తున్న ఒక పెద్దాయనను జూనియర్ వద్దకు రాయబారం పంపాలని భావిస్తున్నారు. మొత్తం మీద జూనియర్ ఎన్టీఆర్ ను వచ్చే ఎన్నికల్లో ప్రచారానికి తీసుకురావాలని చంద్రబాబు కూడా గట్టిగా భావిస్తున్నారు. పరిమితమైన చోట ఆయన ప్రచారం ఉండేలా ప్లాన్ చేయాలని నిర్ణయించారు. మరి జూనియర్ ఇందుకు అంగీకరిస్తారా? లేదా? అన్నది చూడాలి.

# పైపుల రెడ్డి గారి ఫ్యామిలీ రాజకీయ సన్యాసమేనా

కర్నూలు, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)ఏదైనా అంతే.. రాజకీయల్లో ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం వాటిని సరైన దిశగా అందిపుచ్చుకుంటే సరి. లేకుంటే ఇక అథపాతాళానికి పడిపోయినట్లే. ఒకప్పుడు పైపుల రెడ్డి అని పిలుచుకునే ఎస్పీవై రెడ్డి కుటుంబం ఇప్పుడు రాజకీయంగా పూర్తిగా పక్కకు తప్పుకున్నట్లే అనిపిస్తుంది. నంద్యాల నియోజకవర్గాలను ఒకప్పుడు ఎస్పీవై రెడ్డి శాసించారు. నంద్యాల పార్లమెంటు సభ్యుడిగా ఆయన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నందిపైపులను కర్నూలు జిల్లాలోనే ఏర్పాటు చేయడం, ఒక రూపాయికే భోజనం వంటి కార్యక్రమాలతో ఎస్పీవై రెడ్డి ఆ ప్రాంత ప్రజలకు దగ్గరయ్యారు. పారిశ్రామికవేత్తగా సక్సెస్ సాధించిన ఆయన పాలిటిక్స్ లోనూ అదే విజయలను అందుకున్నారు. నంద్యాల ఎంపీగా అనేక సార్లు విజయం సాధించి ఎన్నో పనులు చేపట్టారు. కాంగ్రెస్, వైసీపీల నుంచి ఆయన ఎంపీగా గెలిచారు. 2014లో నంద్యాల ఎంపీగా గెలిచిన ఎస్పీవై రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు.అదే ఆయన చేసిన తప్పు. టీడీపీలో చేరిన ఆయన తర్వాత అనారోగ్యం పాలయ్యారు. నంద్యాల ఉప ఎన్నికల్లోనూ టీడీపీ తరుపున విస్తృత ప్రచారం చేశారు.. అప్పటి వరకూ నంద్యాల అసెంబ్లీ టిక్కెట్ కోసం ఆయన చంద్రబాబు వద్ద పెద్ద పంచాయతీయే పెట్టారు. తన అల్లుడికి టిక్కెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. 2019 ఎన్నికల సమయంలో ఆయన జనసేనలో చేరి పోటీ చేశారు. వీల్ ఛైయిర్ లోనే ప్రచారం చేశారు. తర్వాత ఆయన మరణించారు.ఇప్పుడు ఆ కుటుంబం జనసేనలో ఉందా? అంటే లేదనే చెప్పాలి. ఇటు టీడీపీలోనూ లేదు. ఎస్పీవై రెడ్డి అల్లుడు శ్రీధర్ రెడ్డి మాత్రం వైసీపీలోకి వెళ్లాలని గట్టిగా భావిస్తున్నారు. ఇటు మామ పేరుతో పాటు పార్టీ కూడా తమకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకపోయినా వైసీపీతోనే ఉండాలని శ్రీధర్ రెడ్డి నిర్ణయించుకున్నారని తెలిసింది. త్వరలోనే ఆయన వైసీపీకి తిరిగి వెళతారన్న ప్రచారం జరుగుతుంది. అదే జరిగితే మళ్లీ ఎస్పీవై రెడ్డి కుటుంబం వైసీపీలో కనపడుతుంది.

# కేతిరెడ్డి స్వరం మారుతోందా

అనంతపురం, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)కేతిరెడ్డి పెద్దారెడ్డి జగన్ పార్టీలో నమ్మకమైన నేత. దశాబ్దాలుగా తాను అనుకున్న కలను సాకారం చేసింది జగన్. అటువంటి జగన్ ను పెద్దారెడ్డి తూలనాడతారా? ఆ అవసరం ఏమొచ్చింది? ఎందుకు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు? టీడీపీ అనుకూల మీడియా పెద్దారెడ్డి వ్యాఖ్యలపై రాద్ధాంతం చేసింది. ఇప్పుడు వైసీపీలో చర్చనీయాంశమైంది. పాపం పెద్దాయన మాత్రం అనవసరంగా బుక్కయ్యారన్న కామెంట్స్ నెట్టింట బాగానే విన్పిస్తున్నాయి.తాడిప్రతిలో సుదీర్ఘకాలం తర్వాత జేసీ కుటుంబాన్ని ఓడించి కేతిరెడ్డి పెద్దారెడ్డి జెయింట్ కిల్లర్ గా నిలిచారు. తాను కూడా ఎమ్మెల్యే అయి కలను సాకారం చేసుకున్నారు. తాడిపత్రిలో వైసీపీ గెలవడానికి జగన్ వేవ్ ఒక కారణమైతే, పెద్దారెడ్డి పట్టుదల కూడా మరొక కారణంగా చెప్పాలి. మొత్తం మీద పెద్దారెడ్డి గెలిచినా మున్సిపల్ ఎన్నికల్లో తాడిపత్రి మున్సిపాలిటీ చేజారడం ఆయనను రాజకీయంగా ఇబ్బందుల్లోకి నెట్టింది.ఆ ఫ్రస్టేషన్ లో ఆయన కొంత తడబడుతున్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి పైన పెద్దారెడ్డి చేసిన వ్యాఖ్యలు జగన్ కు వర్తించేలా మారాయి. నిజానికి పెద్దారెడ్డి అనింది జేసీ ప్రభాకర్ రెడ్డిని. ఆ విషయం ఆయన వ్యాఖ్యలు విన్నవారికి ఎవరికైనా అర్థమవుతుంది. నాయకుడు ఇన్ని అబద్ధాలు చెప్పుకుంటూ ప్రజలను మోసపుచ్చుతూ బతకడం మంచిది కాదని అన్నారు. దానికి ముందు జగనన్న లాంటి నాయకుడు అనే పదం రావడంతో ఇబ్బందిగా మారింది.పెద్దారెడ్డి ఉద్దేశ్యం జగనన్న లాంటి నమ్మకమైన నేత రాష్ట్రంలో ఉండగా అబద్ధాలు చెప్పుకుంటూ జేసీ బతకడం సరికాదని అనాలి. కానీ పెద్దారెడ్డి తడబాటుతో ఆ విమర్శలు జగన్ కు చుట్టుకున్నాయి. దీనిపై పెద్దారెడ్డి పార్టీ కార్యాలయానికి వివరణ ఇచ్చినట్లు తెలిసింది. తన కామెంట్స్ ను కట్ చేసి మరీ అతికించారని ఆయన సీఎంవో కు కూడా వివరణ ఇచ్చుకున్నట్లు తెలిసింది. నిజానికి పెద్దారెడ్డి జగన్ ను విమర్శించే అవసరం లేదు. ఆయన కంఫర్ట్ గా వైసీపీలో ఉన్నారు. ఎమ్మెల్యే పదవికి మించి ఆయన పెద్దగా ఆశిస్తున్నది కూడా లేదు. దీంతో వైసీపీ అధిష్టానం కూడా చిరునవ్వు నవ్వి పెద్దారెడ్డి కామెంట్స్ ను లైట్ గా తీసుకుందంటున్నారు.

# పోలీస్ స్టేషన్ లో టిడిపి జెండాలు

నెల్లూరు అక్టోబరు 20, (న్యూస్ పల్స్)ఆంధ్రలో పోలీస్ స్టేషన్ లో పసుపు జెండాలు కనపించిన సీన్ వెరైటిగా కనిపించింది..టిడిపి బంద్ ను విఫలం చేస్తున్న పోలీసులు లీడర్స్ తో పాటు పసుపు జెండాలను పోలీస్ స్టేషన్ లో ఉంచారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర బందుకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం ఉదయగిరి లోని పలు నాయకులను బంద్ నిర్వహించకుండా అదుపులోకి తీసుకున్నారు. ఉదయగిరి పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో టిడిపి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తుగా టిడిపి మైనార్టీ నాయకులు రియాజ్, మండల కన్వీనర్ బయన్న, నరసింహులు, పలు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఐ గిరిబాబు, ఎస్సై ఎంకమ్మ,, లతీఫ్ ఉన్నిసా చర్యలు తీసుకున్నారు.


## గొల్లపూడిలో మాజీమంత్రి దేవినేని ఉమా అరెస్ట్

విజయవాడ అక్టోబరు 20, (న్యూస్ పల్స్)గొల్లపూడిలో మాజీమంత్రి దేవినేని ఉమాను పోలీసులు అరెస్ట్ చేసారు. టిడిపి రాష్ట్ర బంద్ పిలువు నేపథ్యంలో గొల్లపూడి వన్ సెంటర్ లో నిరసన తెలిపేందుకు వచ్చిన మాజీమంత్రి దేవినేని ఉమాను అరెస్ట్ చేసారు. దేవినేని మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటవిక,అరాచక పాలన సాగుతోంది. జగన్ సర్కార్ స్వేచ్ఛను హరిస్తోంది. పోలీసులు వైసీపీ తొత్తులుగా మారిపోయారు. టిడిపి కేంద్ర కార్యలయంపై వైసిపి గుండాలు దాడి చేస్తే దానికి నిరసనగా బంద్ చేపట్టడం తప్పా? ముఖ్యమంత్రి జగన్ అధికారం శాశ్వతం కాదని తెలుసుకోవాలని అన్నారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసారు.

# పోలీసుల జులుం నశించాలి

కళ్యాణదుర్గం అక్టోబరు 20, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి, కంబదూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి కుందుర్పి పోలీస్ స్టేషన్ తరలించారు. బంద్ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి పోలీసుల సహకారంతో వై ఎస్ ఆర్ సి పి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసిందని వారు ఆరోపించారు. తమను నిర్బంధించడం దుర్మార్గపు చర్య.. పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేసారు.

# బీజేపీకి జనసేన మద్దతు



బద్వేలు అక్టోబరు 20, (న్యూస్ పల్స్)కడప జిల్లా బద్వేలు లో బీజేపీ, జనసేన నేతలు మీడియాతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజుమాట్లాడుతూ మిత్ర పక్షమైన బీజేపీ అభ్యర్థి గెలుపునకు జనసేన కృషి చేస్తుంది. వైసీపీ నేతల్లో ఓటమి భయం వెంటాడుతోంది. వైసీపీ మంత్రి వర్గం అంతా బద్వేలు లోనే తిష్ట వేసింది. ఎమ్మెల్యే రాచమల్లు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యే రాచమల్లు పై ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసామని అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ఉప ఎన్నికలో బీజేపీ కి ఏజెంట్ లు లేకుండా చేస్తామన్నారు. ఉప ఎన్నికలో వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. నిన్న కొంత మంది వైసీపీ మంత్రులు దళితులకు బీజేపీ ఏమి చేసిందని మాట్లాడారు. బద్వేలు లోని 7 గ్రామాల్లో 7 కోట్ల పై చిలుకు నిధులు కేంద్రం ఇచ్చింది. వైసీపీ మాత్రం 3 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. గోపవరం పంచాయతీ కి కేవలం 500 రూపాయలు నిధులు ఇచ్చింది. కేంద్ర నిధులను వైకాపా దుర్వినియోగం చేస్తుంది. కేంద్ర పథకాలకు వైసీపీ స్టిక్కర్లు వుంటున్నాయి. అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే. సంక్షేమం పేరుతో సంక్షోభం చేస్తున్న వైసీపీ. కేంద్రం సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తుంది. వైసీపీ కేవలం నవరత్నాలే చెప్తారు. ప్రజలకు ఓటేసుకునే హక్కు కల్పించాలి. లిక్కర్ మాఫియా ను వైకాపా నడిపిస్తుందని ఆరోపించారు.బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ బద్వేలు ఉప ఎన్నికలో జనసేన మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. రాష్ట్రంలో దాడులు పెరిగిపోయాయి. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది. వైసిపి నేతల్లో భయం పట్టుకుంది. బద్వేలు లో ఓటర్లను భయ భ్రాంతులకు గురిచేయలని వైసీపీ నేతలు చూస్తున్నారు. టీడీపి కార్యాలయం పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.జనసేన కడప అసెంబ్లీ ఇంచార్జ్ సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేనాని పవన్ కళ్యాణ్ బద్వేలు ఉప ఎన్నికకు త్రిసభ్య కమిటీని నియమించారు. మాట తప్పను అన్న జగన్ యూ టర్న్ తీసుకున్నారు. ఏపీ ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చిన వైసీపని అన్నారు. వైసీపీ ని గద్దె దించడమే బిజెపి, జనసేన లక్ష్యం. వైసిపి దాడులకు, దౌర్జన్యాలకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు.బద్వేలు బిజెపి అభ్యర్థి పనతల సురేష్ మాట్లాడుతూ జనసేన కలిసి రావడాన్ని స్వాగతిస్తున్నాం. జనసేన, బీజేపీ కలిసి సైనికుల్లా పని చేస్తామని అన్నారు. ఉప ఎన్నికలో గెలుస్తాం. బద్వేలు ఉప ఎన్నిక తర్వాత రాష్ట్రం లో దశ దిశ మారబోతున్నాయి. బద్వేలు ఉప ఎన్నికలో బీజేపీ గెలుస్తుందని ధీమా వుంది. వైసీపీ పతనం బద్వేలు ఉప ఎన్నిక తోనే మొదలు అవుతుందని అన్నారు.

# చెరువులో స్కూల్ బస్సు బోల్తా

శ్రీకాకుళం అక్టోబరు 20, (న్యూస్ పల్స్)జిల్లాలో విషాదం చోటుచే సుకుంది. ఎచ్చెర్ల మండలం బడివా నిపేట సమీపంలోని నల్ల చెరువులో.. కొంగర గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. బస్సు ఒక్కసారిగా చెరువులో బోల్తా పడడంతో విద్యార్థులకు ఒక్క సారిగా భయాందోళనలకు గురయ్యా రు. ఓ విద్యార్థి బస్సు కింద పడి స్పాట్‌లోనే మృతిచెందాడు. మరో ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాల య్యాయి. పిల్లల అరుపులు, గాయాల బాధలతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకుంది. మిగిలిన విద్యార్థులను చెరువులో నుంచి ఒక్కొక్కరిని బయటకు తీసి చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థి బడివానిపేటకు చెందిన 8 ఏళ్ల మైలపల్లి రాజుగా గుర్తించారు. చెరువులో బోల్తా పడిన బస్సును జేసీబీ సహాయంతో బయటకు తీశారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద గురించి తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు, సమీప గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో చెరువు వద్దకు చేరుకుని, సహాయ చర్యల్లో పాలు పంచుకుంటున్నారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా ఉన్నతాధికారులు ఘనటపై ఆరా తీశారు. గాయపడ్డ పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై నివేదిన ఇవ్వాలని స్థానిక యంత్రాంగాన్ని ఆదేశించారు.

# ఘటనలు ఊహించిందే?

విజయవాడ అక్టోబరు 20, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఇలాం టి ఘటనలు జరుగుతాయని ముందే ఊహించామని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి అన్నారు. పాలక పార్టీ శ్రేణులు టిడిపి కేంద్ర కార్యాలయంపైన, వివిధ జిల్లాల్లో టిడిపి కార్యాలయాలు, నాయకుల ఇళ్ల వద్ద ఆందోళనలు, దాడులు నిర్వహించడం శోచనీయ మని పేర్కొన్నారు. విజయవాడలో పట్టాభి ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించడం అమానుషమని తుల సిరెడ్డి అన్నారు. విమర్శలు నిర్మాణా త్మకంగా, సద్విమర్శలుగా ఉండేలా సంయమనం కోల్పోకుండా విమర్శలు చేయాల్సిన బాధ్యతను ఎవ్వరూ విస్మరించకూడదన్నారు. సద్విమర్శ లను కూడా భరించలేని వాతావరణం నెలకొనడం ప్రజాస్వామ్య వ్యవస్థకే హాని చేస్తుందని, ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు విమర్శలు చేస్తే భౌతిక దాడు లు చేసే అప్రజాస్వామిక చర్యలకు పాలక పార్టీ శ్రేణులు పాల్పడితే శాంతి భద్రల సమస్యకు వారే ఆజ్యంపోసిన వారౌతారని, డిజిపి ఆఫీసు ప్రక్కనే ఉన్న టీడీపీ కేంద్ర కార్యాలయంపైనే దాడి చేస్తే నివారించలేని దుస్థితి దేనికి అద్దం పడుతున్నదో ప్రభుత్వం తీవ్రం గా ఆలోచించాలని కోరారు. అధికారం లో ఉన్నవారు అణిగి మణిగి ఉండాలి కానీ, రాజ్యాంగం కల్పించిన హక్కుల ను హరించే ప్రయత్నం చేయడం శోచనీయమని పేర్కొన్నారు. శాంతి భద్రతలు ఇంతగా దిగజారుతున్నా పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందని తుల సిరెడ్డి ప్రశ్నించారు. వెంటనే ఈ ఘటన పై విచారణకు ఆదేశించి దీని వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించవద్దని అన్నారు.

# వారణాసి నుంచి పోటీకి ప్రియాంక



లక్నో, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పునరుజ్జీవం తేవడం కోసం ఆ పార్టీ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా ప్రయత్నాలు వేగవంతం చేశారు. వారణాసిలో అక్టోబర్ 10న ప్రచారం ప్రారంభించిన ప్రియాంక ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. వరుసగా అక్కడి నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. తాజాగా పార్టీ కార్యవర్గ సమావేశాన్ని ప్రియాంక నిర్వహించారు. ఈ సమావేశంలో తన ప్రధాన కార్యాలయాన్ని లక్నోకు తరలిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సమావేశాల్లోనే ఆమె ఎన్నికల వ్యూహానికి సంబంధించిన బ్లూప్రింట్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా తాను ఇకపై ఎన్నికలు పూర్తయ్యేవరకూ యూపీలోనే ఉంటాననీ.. ప్రతి వరం ఐదు జిల్లాలను కవర్ చేస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాననీ పేర్కొన్నారు.ప్రియాంక గాంధీ సన్నిహితుల నుండి అందుతున్న సమాచారం ప్రకారం, ప్రియాంక గాంధీ స్వయంగా ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. రాష్ట్రంలోని తూర్పు- పశ్చిమ ప్రాంతాల నుండి ఆమె పోటీ చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితుడు ఒకరు తెలిపారు. వీటిలో ఒక సీటు వారణాసి నుండి కాగా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ సీటు ఇంకా ఎంపిక కాలేదు. లక్నోలోని షీలా కౌల్ బంగ్లాను ప్రియాంక కాంగ్రెస్ వార్ రూమ్ గా మార్చారు. ఇక్కడే ఎన్నికల కోసం వ్యూహ రచనలు చేస్తున్నారు.ప్రియాంక సిబ్బంది ఢిల్లీ నుంచి లక్నోకు మారుతున్నారు. నవంబర్ 14 న, కౌల్ నివాస్‌ను కాంగ్రెస్ ఎన్నికల ప్రధాన కార్యాలయంగా ప్రకటించాలని భావిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. లఖింపూర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండ తర్వాత ప్రియాంక గాంధీ బాధ్యతలు స్వీకరించిన విధానం, కార్యకర్తలలో కొత్త శక్తి కోసం పార్టీ ఆశలు పెట్టుకుంది. మహిళా ఓటర్లను ఆకర్షించడానికి, మహిళలకు 33% టిక్కెట్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించవచ్చని ఆ వర్గాలు తెలిపాయి.వచ్చే సంవత్సరంలో యూపీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు కాంగ్రెస్ కు వివిధ కారణాల రీత్యా చాలా కీలకం. అందుకే ఇప్పటి నుంచే యూపీ ఎన్నికలలో విజయం కోసం ఏమి చేయాలి.. ఓటర్లను ఎలా ఆకట్టుకోవాలి? అభ్యర్థుల ఎంపిక ఇటువంటి అన్ని విషయాలపై కసరత్తులు మొదలు పెట్టేసింది. వివిధ కులాలు, మతాల ప్రజల అవసరాలకు అనుగుణంగా, వారిని ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ భిన్నమైన ప్రణాళికలు వేసింది. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, మదర్సాల్లో చదువుతున్న పిల్లలకు సహాయం చేయడం ద్వారా ముస్లిం ఓటర్ల మనస్సులో చొరబడటానికి కాంగ్రెస్ దృష్టి పెడుతోంది. ఇందుకోసం రాష్ట్రంలో ఉన్న 2 లక్షల మదర్సాల జాబితాను కూడా సిద్ధం చేశారు.2017 అసెంబ్లీ ఎన్నికల్లో 47%, పార్లమెంట్ ఎన్నికల్లో 20 శాతం యాదవ్ ఓట్లు ఎస్పీతో ఉన్నాయి. ఇప్పుడు ఇందులో 28 నుంచి 30 శాతం ఓట్లు కాంగ్రెస్ పొందాలని భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా పావులు కదుపుతోంది. ఇందులో 30 శాతం ఓట్లు సాధిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయడం సులభం అవుతుందని కాంగ్రెస్ లెక్క. దీనికి అదనంగా 20 శాతం ముస్లిం ఓటర్లను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ వైపు వచ్చేలా కోరుతారు. ఇక బ్రాహ్మణులూ, యాదవ్ కాని ఓబీసీలు, దళితులూ బీజేపీ తో ఉంటారు. అందుకే కాంగ్రెస్ ప్రస్తుతం ముస్లిం ఓబీసీపై దృష్టి పెట్టింది

# 4 బల్లలు పగలు కొడితే రాష్ట్రపతి పాలనా

విజయవాడ, అక్టోబరు 20, (న్యూస్ పల్స్)ఏపీ రాజకీయాలు భగ్గుమంటున్నాయి. అటు వైసీపీ నేతలు, ఇటు టీడీపీ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారయ్యాయి రాష్ట్ర రాజకీయాలు. ప్రతి రోజు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడంతోనే సరిపోతుంది. ఇక నిన్న తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పట్టాభి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీంతో వైసీపీ నేతలు, కార్యకర్తలు కోపాన్ని కట్టలు తెంచుకున్నారు. పట్టాభి ఇంటిపై టీడీపీ కార్యాలయాలపై దాడులకు దిగారు. ఫర్నిచర్లు ధ్వంసం చేశారు. దీంతో దాడులకు నిరసనగా టీడీపీ నేడు బంద్‌కు పిలుపుచ్చింది.టీడీపీ నేతలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నాయుడు ఆఫీస్‌లో కూర్చుని జగన్‌ను తిట్టారు. అందుకే పార్టీ ఆఫీస్‌ను పగలగొట్టారని అన్నారు.చంద్రబాబు 420.. నాలుగు బల్లలు, కుర్చీలు పగలగొడితే ప్రజాస్వామ్యం ఖూనీ అయినట్టా అని నాని ప్రశ్నించారు. నీ ఆఫీస్‌లో బల్లలు పగిలితే రాష్ట్రపతి పాలన పెట్టాలా..? అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు బంద్‌కు పిలుపునిస్తే రాష్ట్రంలో బడ్డీకొట్టు కూడా మూయించలేదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.నిన్న మొదలైన ఈ ఘర్షణ వ్యవహారంలో తారా స్థాయికి చేరిపోయింది. ఒకరిపై ఒకరు మాటల యుద్ధమే కాకుండా ఒకరిపై ఒకరు దాడులకు తెగబడుతున్నారు. రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీసు బలగాలు ఆందోళనకు దిగుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలను ఎక్కడికక్కడే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్నారు. బంద్‌లో భాగంగా అటు టీడీపీ నేతలు, ఇటు పోలీసుల మధ్య తోపులాట జరుగుతోంది. బస్సులను తిరగనీయకుండా అడ్డుకుంటున్నారు. రోడ్లపై బైఠాయించి నిరసనకు దిగుతుండటంతో అరెస్టు పర్వం కొనసాగిస్తున్నారు పోలీసులు.

# బుద్దా వెంకన్న నివాసంలో పోలీసులు

## పోలీసులపై నమ్మకం లేదు.. మా రక్షణ మేమే చూసుకుంటాం

## బుద్దా వెంకన్న



విజయవాడ అక్టోబరు 20, (న్యూస్ పల్స్) ఎపి లో పోలీసు వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకం పోయింది. డిజిపి నే...వైసిపి కార్యనిర్వాహక అధ్యక్షులు గా పని చేస్తున్నారని టీడీపీ నేత బుద్దా వెంకన్న ఆరో?పించారు. ఆయన ఆదేశాలతో పోలీసులు కూడా వైసిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. నిజాయితీ గల అధికారులు కూడా డిజిపి వల్ల ఉద్యోగాలు చేయలేని పరిస్థితి. టిడిపి హయాంలో పోలీసు వ్యవస్థ కు ఎంతో గౌరవం ఉండేది. ఇప్పుడు మాకు పోలీసు ల పై నమ్మకం లేదు. మాకు మేమే రక్షణ గా .. నిలబడి.. వైసిపి రౌడీ మూకలను అడ్డుకుని తీరతామని అన్నారు.దాడికి దాడే సమాధానం అని మేము కూడా నిర్ణయించుకున్నాం. చంద్రబాబు గాంధీజీ సిద్దాంతాల వల్ల వైసిపి వాళ్లు రెచ్చిపోతున్నారు. చంద్రబాబు ఫోన్ చేస్తే డిజిపి కి స్పందించాల్సిన బాధ్యత లేదా. జగన్మోహన్ రెడ్డి కనుసన్నల్లోనే ఈ దాడులు జరిగాయి. ఎపి లో ఆర్థిక ఎమర్జెన్సీ నెలకొంది. దృష్టి మళ్లించడానికే ఈ వరుస దాడులని అయన అన్నారు.

# నూజివీడులో భారీ బందోబస్తు

నూజివీడు అక్టోబరు 20, (న్యూస్ పల్స్) టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నూజివీడు పట్టణంలో డిఎస్పీ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. టిడిపి కార్యాలయాలు, నాయకుల ఇళ్ల పై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. ఒక సిఐ, ముగ్గురు ఎస్సైలు 35 మంది సిబ్బంది, పెట్రోలింగ్, మొబైల్ పార్టీ తో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నూజివీడు సబ్ డివిజన్లు ఇరవై ఆరు మందిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మరి కొంతమందిని హౌస్ అరెస్ట్ చేసినట్లు ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని చూసిన వారిపై చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు

# చెరువులో స్కూలు బస్సు బోల్తా

శ్రీకాకుళం అక్టోబరు 20, (న్యూస్ పల్స్) శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కొయ్యాము పంచాయతీ నిమ్మవానిపేట గ్రామం వద్ద చెరువులో స్కూల్ బస్ బోల్తా పడింది. కమ్మపేట నుండి నిమ్మవానిపేట వెళ్లి తిరిగివస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. క్రేన్స్ సహాయంతో స్థానికులు బస్సును బయటకు తీసారు. ఘటనలో ఒక బాలుడు మృతి చెందినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు నిర్ధారించలేదు.

# రోడ్డు ప్రమాదంలోఇద్దరు హెడ్ మాస్టర్లకు గాయాలు

గుంటూరు అక్టోబరు 20, (న్యూస్ పల్స్) గుంటూరు జిల్లా అనుపాలెం పెదకాలువ దగ్గర బైక్ ని డికొన్న కారు ఈ ప్రమాదంలో ఇద్దరు హెడ్ మాస్టర్స్ కి తీవ్రగాయాలయ్యాయి. ఒకరు గుంటూరు జిల్లా కారంపూడి మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన హైస్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాసరావు కాగా ఇకొక్కరు కారంపూడి మండలంలోని పెదకొదమగొండ్ల గ్రామ హై స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాసరావు గా తెలుస్తోంది ఇద్దరికి తీవ్ర గాయాలు ( మోకాలు వరకు విరిగిపోయాయి) అని బాధిత బంధువులు ద్వారా తెలిసింది. వీరు పని నిమిత్తం ఎక్కడికి వెళ్తున్నారు వీరిని ఢీకొన్న కారు ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్తుంది తదితర వివరాలు దీనిపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది!

# అక్రమ సంబంధం నేపథ్యంలో హత్య

తాండూరు అక్టోబరు 20, (న్యూస్ పల్స్) వికారాబాద్ జిల్లా యాలాల మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన వికారాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం... యాలాల మండలంలోని తిమ్మాయిపల్లి గెట్ సమీపంలో పవన్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న సీఐ జలంధర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. నిందితుడు మల్లప్పను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమ సంబంధమే హత్యకు కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడించినట్లు సమాచారం. నిందితుడు కురువ మల్లప్ప భార్య కురువ లక్ష్మికి బురుగుపల్లి పవన్ కు మధ్య గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ సంబంధం ఉన్న నేపథ్యంలో హత్యకు దారి తీసిన వైనం. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాండూర్ డిఎస్పి లక్ష్మీనారాయణ తాండూరు రూరల్ సీఐ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

## సీఎం కప్ టోర్నీని ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి

శ్రీకాకుళం అక్టోబరు 20, (న్యూస్ పల్స్) సీఎం కప్ టోర్నీని డిప్యూటీ సీఎం, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ శ్రీకాకుళం నుంచి బుధవారం ప్రారంభించారు. మహిళల, పురుషుల విభాగంలో 13 క్రీడావిభాగాల్లో జిల్లా స్థాయిలో ఓపెన్ మీట్ జరుగుతాయి. ఏపీలోని గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేలా రాష్ట్ర వ్యాప్తంగా ఉగాది వరకూ సీఎం కప్ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో మూడు నుంచి నాలుగు దశల్లో జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతున్నాయి. ఫేజ్?1లో భాగంగా అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్ పోటీలకు షెడ్యూల్స్ ప్రకటన విడుదల అయింది. మొదట ఈ నెల 20న శ్రీకాకుళం, 21న విశాఖపట్నంలో పోటీలు జరగుతున్నాయి. మొత్తం 175 నియోజకవర్గాల్లో.. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్లకు మళ్లీ పోటీలు నిర్వహించి బహుమతుల ప్రధానం చేస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రతిభ గల క్రీడాకారులతో జిల్లా జట్లను ఎంపిక చేస్తారు. డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు ప్రతి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారు. సీఎం కప్ లో క్రీడలు అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ఫుట్బాల్, హ్యాండ్బాల్, హాకీ, బాస్కెట్బాల్, బ్యాడ్మింటన్ వుంటాయి.

## కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు తీవ్ర వైఫల్యం (యు ఎస్ ఎఫ్ ఐ)

ఎమ్మిగనూరు అక్టోబరు 20 ( విభారె). :--కార్పొరేట్ ప్రైవేటు విద్యా సంస్థలు జీవో నెంబర్ 43,44 ను తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు ఉదయ్, ప్రకాష్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ కార్పొరేట్ ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను అధిక ఫీజులు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వీటిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తున్నారన్నారు యాజమాన్యాలకు తొత్తులుగా మారి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధిక మొత్తం వసూలు చేస్తూ విద్యను వ్యాపారం గా మారుస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే యుఎస్ఎఫ్ఐ గా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నాయకులు నాయక్, బాలుముని, తదితరులు పాల్గొన్నారు,




## తుగ్గలిలో పంట కోత ప్రయోగం నిర్వహణ

తుగ్గలిఅక్టోబరు 20 ( విభారె): మండల కేంద్రమైన తుగ్గలి నందు పంట కోత ప్రయోగంను వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. బుధవారం రోజున శ్రీనివాసులు రెడ్డి పొలంలో వేరుశెనగ పంట కోత ప్రయోగం ను నిర్వహించారు. పొలం నందు 55 మీటర్ల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 2 కేజీల 250 గ్రామంలో దిగుబడి వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు. పంట కోత ప్రయోగం ఆధారంగా ఎకరాకు 2 నుండి 3 క్వింటాల్ దిగుబడి వస్తుందని వారు తెలియజేశారు. సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో పంట దిగుబడులు తగ్గినట్లు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారులు రంగన్న,లక్ష్మి చైతన్య, విఏఏ లోహిత్ కుమార్,ఎంపీఈఓ లు స్రవంతి, చైతన్య కుమారి,గ్రామ తలారి హంపయ్య,గ్రామ వాలంటరీ లు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

## రాతిదూలం పోటీలను ప్రారంభించిన గుంతా రఘు



తుగ్గలిఅక్టోబరు 20 ( విభారె).: తుగ్గలి మండల పరిధి లోని జొన్నగిరి గ్రామం నందు నిర్మాణమైన శ్రీ వాల్మీకి మహర్షి మందిరం నందు వాల్మీకి జయంతి గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. మందిర నిర్మాణ పంచమ వార్షికోత్సవ సందర్భముగా జొన్నగిరి గ్రామము నందు బుధవారం రోజున రాష్ట్ర స్థాయి దేశపు ఎద్దుల బండ లాగుడు పోటీలను జొన్నగిరి విద్యా కమిటీ చైర్మన్ గుంతా రాఘవేంద్ర పోటీలను ప్రారంభించారు. బుధవారం రోజున శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహానికి అభిషేకములు,మధ్యాహ్నం అన్నప్రసాద సమర్పణ మరియు సాయంకాలం శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహము ఊరేగింపు కార్యక్రమము నిర్వహించారు. బుధవారం నిర్వహించిన బండలాగుడు పోటీలలో దాదాపు 13 కాడేలు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి దేశపు ఎద్దుల బండ లాగుడు పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 20,000 రూ,రెండవ బహుమతి 15,000,మూడవ బహుమతి 10,000, నాల్గవ బహుమతి దాత 8,000,ఐదవ బహుమతి దాత 5.000,ఆరవ బహుమతి దాత 3,000,ఏడవ బహుమతి దాత 2,000 రూ లను అందజేశారు. వాల్మీకిలు పెద్ద ఎత్తున పాల్గొని వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంతా దేవి,ఎంపీటీసీ ప్రతాప రెడ్డి, తెరప్ప,పలువురు వాల్మీకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జొన్నగిరి ఎస్సై రామాంజనేయులు తమ సిబ్బంది చేత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వార్డు సచివాలయాల లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి

### కాంగ్రెస్ రాష్ట్ర సేవాధల్ కార్యదర్శి యస్ మస్తాన్ ఖాన్

నంద్యాల అక్టోబరు 20 ( విభారె): :- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వార్డు సచివాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని . కాంగ్రెస్ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఎస్ మస్తాన్ ఖాన్ జానో జాగో (ముస్లింల అభివృద్ధి వేదిక ) జాతీయ కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా డిమాండ్ చేశారు . వారు బుధవారం నాడు విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ సచివాలయంలో ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తే కొంత మంది సచివాలయ సిబ్బంది చేసే సంఘటన వల్ల సచివాలయం రావాలంటే భయపడవలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీనికి ఉదాహరణగా నంద్యాల 27 వార్డ్ లో జరిగిన సంఘటన అని అన్నారు. మహిళా పై దాడి చేసి మరల ఆ మహిళ పైన కేసు పెట్టారని వారు అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సచివాలయం కు ప్రజలు రావాలంటే భయ భ్రాంతులకు గురి కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చెత్త బయట వేస్తే సీసీ కెమెరాలు పెట్టి చూస్తామని అధికారులు చెబుతున్నారని కానీ ఎక్కడా కూడా అమలు కాలేదని అన్నారు. సచివాలయంలో ఏం జరుగుతున్నాయో తెలియాలంటే కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని దీనివల్ల భవిష్యత్తులో ఏదైనా సంఘటన జరిగితే సిసి కెమెరా ద్వారా చూసి పరిష్కారం చేయవచ్చునేది నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల పైచిలుకు ఉన్న సచివాలయాల్లో ఏం జరుగుతుందో ప్రజలకు ఎలా పని చేసి పెడుతున్నారు తెలుస్తుందని అన్నారు.

## రాష్ట్రంలో వైస్సార్ ప్రభుత్వం రౌడీయిజం మానుకోవాలి

### రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు అయిన మా తెలుగు దేశం నాయకులను విడుదల చేయాలి

### మా ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి గారు ని హౌస్ అరెస్టు నుండి విడుదల చేయాలి

కౌతాళంఅక్టోబరు 20 ( విభారె):మంత్రాలయం నియోజకవర్గ కౌతాళం మండలంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు నిన్న జరిగినటువంటి కేంద్ర కార్యాలయం పై తెలుగుదేశం పార్టీ నాయకులపై వైస్సార్ గూండలు దాడులు చెయ్యడం, ఎంతవరకు న్యాయం అని కౌతాళం మండల కన్వీనర్ గోతులదొడ్డి ఉలిగయ్య అద్వర్యం లో కౌతాళం మండల కేంద్రంలో బందు చేయించడం జరిగింది, ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప ధని, జిల్లా రైతు సంఘము కార్యదర్శి వెంకటపతి రాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయుడు, టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివమూర్తి వారు ఈ దాడులను ఖండిస్తూ, రాష్ట్రంలో భారత రాజ్యాంగం ఉందో లేదో గాని రాజారెడ్డి రౌడీయిజం వైస్సార్ కార్యకర్తలు చేస్తున్నారని వారు మండిపడ్డారు, రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయ లలపై , నాయకులు ఇంటి పై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులను అరెస్టు చేసిన నాయకుల ను వెంటనే విడుదల చెయ్యాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృత చేస్తామని హెచ్చరించారు, మా మంత్రలయం నియోజకవర్గ వర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు తిక్కరెడ్డి గారిని వెంటనే హౌస్ నుంచి విడుదల చెయ్యాలి, అనంతరం నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది,

## దళితుల అభ్యున్నతి కోసం ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి


### ఏపీ ఎమ్మార్పీఎస్ డిమాండ్ ..

మంత్రాలయం అక్టోబరు 20 ( విభారె).:: దళితుల అభ్యున్నతి కోసం ఎస్సీ కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ముందు ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి ఏపీ ఎమ్మార్పీఎస్ మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షుడు నేపాల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏపీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు నేపాల్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ సమన్వయ కర్త జి.నరసింహులు ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు పందికోన ఈరన్న,లు మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 72 సంవత్సరాలు కావచ్చిన సామాజికంగా ఆర్థికంగా వెనుకబడినది దళిత సామాజిక వర్గం అని దళిత జాతి కూడా అన్ని కులాలతో పాటు సమానంగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలంటే కేవలం విద్య ద్వారా మాత్రమే కాబట్టి విద్యాపరంగా జ్ఞానాన్ని పంచే మహనీయుల చరిత్రలు అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాలుగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు అన్నారు. అనంతరం వీరు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ చంద్రశేఖర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ మోజేష్, మాదిగ ప్రశాంత్, మాదిగ ప్రవీణ్, మాదిగ అభిషేక్, మాదిగ శాంతి రాజు, మాదిగ ప్రభుదాస్, మాదిగ యాకోబు, మాదిగ దేవవరం తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

మంత్రాలయం అక్టోబరు 20 ( విభారె): మండల కేంద్రంలోని ఆంజినేయ్య స్వామి దేవాలయం దగ్గర నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మిగనూర్ ఆర్టీసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై. సీతారామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం యాత్రలో పాల్గొన్నారు. ఈయనతో పాటు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు జి. భీమిరెడ్డి, మండల నాయకులు రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణ రెడ్డి, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, వాల్మీకి నాయకులు లక్ష్మన్న, డిసి. తిమ్మప్ప, దుల్లయ్య, వాల్మీకి యూత్, అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు ఉన్నారు



# అజయ్ భూపతికి ఇప్పుడు ధనుశ్ దొరుకుతాడా?



"నాకు పొగరు అనుకుంటారో .. అహంభావం అనుకుంటారో .. ఓవర్ కాన్ఫిడెన్స్ అనుకుంటారో అనుకోండి. ఈ నెల 8వ తేదీన ఇండస్ట్రీ మరో బ్లాక్ బస్టర్ ఇవ్వబోతోంది" .. 'మహాసముద్రం' ప్రీ రిలీజ్ ఈవెంట్ వేదికపై దర్శకుడు అజయ్ భూపతి చెప్పిన మాటలివి. నిజానికి ఒక సినిమా బ్లాక్ బస్టర్ అవునో కాదో చెప్పవలసింది ఆడియన్స్ .. ఆ సినిమా రాబట్టే వసూళ్లు.. ఏ సినిమా హిట్టుకైనా కొలమానం అది తెచ్చే లాభాలే. అవి లేకపోతే అది వేరే కేటగిరిలోకి జారిపోయినట్టే. ఒక సినిమా టాక్ బాగుంటేనే ఎవరైనా థియేటర్ కి వెళతారు. లేదంటే టీజర్లతో .. ట్రైలర్లతో సరిపెట్టుకుంటారు. అజయ్ భూపతికి తాను తయారుచేసుకున్న కథపై తనకి అంతటి నమ్మకం ఉండటంలో తప్పులేదు. కానీ తనకి నచ్చిన కథ అందరికి నచ్చాలన్నా రూలేం లేదు. ఒకే థియేటర్లో కూర్చున్నప్పటికీ ఒక సినిమాను ఎవరి కోణంలో వాళ్లు చూస్తారు. నిజం చెప్పాలంటే ఇది మణిరత్నం మార్కు సినిమా. అజయ్ భూపతి పెట్టిన ఫ్రేమ్స్ అందుకు దగ్గరగా ఉన్నాయి. ఇక ప్రధాన పాత్రధారుల విషయానికి వస్తే శర్వానంద్ కి చాలా కాలంగా సరైన హిట్ లేదు. సిద్ధార్థ్ ను ఈ స్టేజ్ పై చూసిన తరువాతనే చాలామందికి గుర్తుకు వచ్చాడు. ఇప్పటి యూత్ ఆయన కోసం 'బొమ్మరిల్లు' చూడవలసిన పరిస్థితి. ఇక కథానాయికలు విషయానికి వస్తే అదితీరావుకు గానీ .. అనూ ఇమ్మాన్యుయేల్ కి గాని ఇక్కడ క్రేజ్ లేదు. జగపతిబాబు మంచి ఆర్టిస్ట్ .. పబ్లిసిటీ పరంగా ఆయన పాత్రను హైలైట్ చేసి ఉంటే ఏమైనా కలిసొచ్చేదేమో. అంతో ఇంతో ఇమేజ్ ఉన్న ఒక్క శర్వానంద్ ను పట్టుకుని 'మహా సముద్రం' ఈదాలనుకోవడం సాహసమే అవుతుంది. ఈ సినిమా ఫలితం కూడా అదే విషయాన్ని స్పష్టం చేసింది. ఇప్పటి ప్రేక్షకులకు బరువైన సన్నివేశాలను మోయలేరు .. భారమైన ఫ్లాష్ బ్యాక్ లు చూడలేరు. వాళ్లకి కావలసింది నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్ అంతే. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ .. అంతే అంటూ శిలాశాసనం చేసినట్టుగా అజయ్ భూపతి చెప్పడం వల్లనేనేమో ఆయన దర్శకత్వంలో ధనుశ్ హీరోగా అనిల్ సుంకర ఒక సినిమా ప్లాన్ చేశాడు. ఈ సినిమా రిజల్టు తరువాత చూద్దామని ధనుశ్ వెయిటింగులో పెట్టాడు. మరి ఇప్పుడు ఈ ప్రాజెక్టు ఉంటుందా అనేది సందేహమేనని అంటున్నారు. అనిల్ సుంకర ఓకే అన్నా అవతల ధనుశ్ దొరకాలిగా? ఆయనకున్న అనుభవం ఎక్కువాయే. ఈ నేపథ్యంలో అజయ్ భూపతి తదుపరి సినిమాకి ఎలాంటి కథను రెడీ చేసుకుంటాడో .. ఏ హీరోతో ముందుకు వెళతాడో. తనకి ఈ సినిమాలో ఛాన్స్ ఇవ్వనందుకు అలుగుతున్నట్టు ప్రీ రిలీజ్ ఈవెంట్ వేదికపై చెప్పిన కార్తికేయ .. తనతో తొందరగా ఒక సినిమా చేయమని కోరిన కార్తికేయతోనే అజయ్ ముందుకెళతాడేమో చూడాలి.

# పొర విప్పిన నాగినిలా ఏమిటా లుక్కు రష్మికా?



హాట్ బ్యూటీ రష్మిక మందన కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్ లో ఉంది. రష్మిక పట్టిందల్లా బంగారమే అవుతోంది. టాలీవుడ్ లో ఇప్పటికే మూడు..నాలుగు పెద్ద సినిమాలు చేతిలో ఉన్నాయి. వాటిలో ఒకటి పాన్ ఇండియా ప్రాజెక్ట్. ఆ సినిమా హిట్టైతే రష్మిక కెరీర్ మరింత రంగులమయం అవుతుంది. ఇదే స్పీడ్ లో బాలీవుడ్ లోనూ బిజీ అయ్యే ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం అక్కడా రెండు చిత్రాలు చేస్తోంది. ఇలా క్షణం తీరిక లేకుండా అమ్మడు హైదరాబాద్ టూ ముంబై పరుగులు పెడుతోంది. అన్నింటినీ మించి తనదైన చలాకీతనంతో అభిమానులను సంపాదించుకోవడం విశేషం. రష్మిక ఏదైనా ఈవెంట్ కు హాజరవుతుందంటే ఆమె కోసమే ప్రత్యేకంగా విచ్చేసే అభిమానుల్ని సంపాదించుకుంది. సినిమాల కన్నా..తన మాటకారితనంతోనే ఇదంతా సాధ్యమైంది అన్నది వాస్తవం. రష్మిక చేసింది కొన్నిసినిమాలే అయినా తెలుగు లో చాలా వేగంగా జనాల్లోకి దూసుకెళ్లింది. ఆ సంగతి పక్కనబెడితే ఇన్ స్టాలో ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లతో చేసే రచ్చ గురించి తెలిసిందే. సమయం చిక్కినప్పుడు కొత్త ఫోటో సెషన్స్ లో పాల్గొని ట్రెండీ వెర్షన్స్ తో కుర్రాళ్లలో కాకలు రేపుతోంది. తాజాగా రష్మిక ఓ బ్లాక్ అండ్ వైట్ డిజైనర్ డ్రెస్ లో మత్తెక్కించే లుక్ ఒకటి షేర్ చేసింది. ఈ ఫోటోలో రష్మిక అందచందాలు చూపరులను కట్టి పడేస్తున్నాయి. చూపులతోనే మత్తెక్కిస్తోందంటూ ఇన్ స్టా ఫాలోవర్స్ కామెంట్లతో మరింత హీటెక్కిస్తున్నారు. పొర విప్పిన నాగినిలా ఏమిటా లుక్కు రష్మికా? అంటూ ఒక అభిమాని కాస్త కొంటెగానే ఒపీనియన్ చెప్పాడు. ప్రస్తుతం అల్లు అర్జున్ సరసన పాన్ ఇండియా చిత్రం 'పుష్ప'లో రష్మిక నటిస్తోంది. అలాగే ధృవ సార్జా హీరోగా నంద భాస్కర్ దర్శకత్వంలో తెలుగు..తమిళ్..కన్నడ భాషల్లో తెరకెక్కుతోన్న 'పొగరు'లో నటిస్తోంది. మరోవైపు 'ఆడవాళ్లు మీకు జోహార్లు' అనే చిత్రం షూటింగ్ లోనూ బిజీగా ఉంది. ఇక బాలీవుడ్ లో 'మిషన్ మజ్ను'..'గుడ్ బై' చిత్రాల్లో నటిస్తోంది.

# తాజా సినిమాతో అతడి రెమ్యునరేషన్ రూ.20కోట్లకు చేరింది



బాలీవుడ్ లో మహా అయితే పదిహేనను సినిమాలు చేసి ఉంటాడేమో. హీరోగా ఎంట్రీ ఇద్దామని వెళితే ఛీ కొట్టారు. వేల కొద్దీ ఆడిషన్లకు వెళ్లినా ఉపయోగం లేకపోవటంతో చివరకు ఒక డైరెక్టర్ దగ్గర నెలకు రూ.4500 జీతంతో అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేశాడు. అలా వచ్చిన పరిచయంతో చిన్న పాత్ర చేసిన అతడికి లభించిన పారితోషికం రూ.10వేలు. అలా ఎన్నో ఛీత్కారాలు.. అవమానాల్ని భరించి తన సత్తా చాటే క్రమంలో తాజాగా అతడు నటించిన సినిమా అమెజాన్ ప్రైమ్ లో విడుదల కావటం.. అది హాట్ టాపిక్ గా మారటమే కాదు.. అతడి రెమ్యునరేషన్ ను రూ.20కోట్లకు తీసుకెళ్లింది. ఇప్పటికే అతని పేరు మీకు అర్థమై ఉంటుంది. అవును.. అతడే విక్కీ కౌశల్. గ్యాంగ్ ఆఫ్ వసీపూర్ మూవీకి అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేసి.. బాంబే వెల్వెట్ మూవీలో కాసింత సేపు కనిపించిన అతడికి తొలి బ్రేక్.. 'మసాన్'తో మొదలైంది. ఆ తర్వాత అతను చేసిన సినిమాలు అతడి పేరును అంతకంతకూ పెంచినవే. ఉరి: ది సర్జికల్ స్ట్రయిక్స్ తో అతను ఒక్కసారిగా ఫేమస్ కావటమే కాదు.. జాతీయ అవార్డును సొంతం చేసుకున్నాడు. తాజాగా అతను నటించిన 'సర్దార్ ఉదమ్' మూవీ అమెజాన్ ప్రైమ్ లో విడుదల కావటం.. పాజిటివ్ టాక్ ను తీసుకొచ్చింది. అతడి ఇమేజ్ ను భారీగా పెంచేసింది. సర్దార్ ఉదమ్ వరకు నాలుగైదు కోట్ల రూపాయిల రెమ్యునరేషన్ తీసుకునే విక్కీ కౌశల్ తాజా మూవీ తర్వాత అతడికి రూ.20 కోట్లు ఇచ్చేందుకు సైతం ఓకే చెబుతున్నారట. ఒకప్పుడు తనకు సినిమా అవకాశాలు ఇవ్వమని అడిగిన డైరెక్టర్ల చేత ఛీ కొట్టిన వారే.. ఇప్పుడు సినిమా ఆఫర్లు ఇవ్వటమే కాదు.. భారీ పారితోషికం ఇస్తామని చెబుతున్నారట. సినిమాల పరంగా అంతకంతకూ చెలరేగిపోతున్న విక్కీ కౌశల్.. మరోవైప బాలీవుడ్ అందాల బొమ్మ కత్రినా కైఫ్ తో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లుగా తరచూ వార్తల్లో కనిపిస్తున్నాడు. తాజాగా ఒక పార్టీలో కత్రినాతో టైట్ హగ్ కు సంబంధించిన వీడియో ఒకటి వైరల్ గా మారటం తెలిసిందే. ఇలా సినిమాలతోనూ.. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విశేషాలతో నిత్యం వార్తల్లో కనిపిస్తున్న విక్కీ కౌశల్ కు తాజాగా ఏటు చూసినా తిరుగు లేదని చెప్పాలి. చివరగా.. ఈ మధ్యన అతడు రష్మికతో చేసిన అండర్ వేర్ యాడ్ విమర్శలతో పాటు ట్రోలింగ్ లు ఎదుర్కొన్నా.. అలానూ హాట్ టాపిక్ గానే మారటం గమనార్హం.

# సోధి మాయాజాలం.. 15 ఓవర్ల తర్వాత ఇంగ్లండ్ స్కోర్ 109/5



టాస్ ఓడి ప్రత్యర్థి ఆహ్వానం మేరకు తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు తొలి బంతికే షాక్ తగిలింది. ఓపెనర్ జేసన్ రాయ్‌ను సౌథీ క్లీన్ బౌల్డ్ చేశాడు. అనంతరం జోస్ బట్లర్(51 బంతుల్లో 73; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) చెలరేగి ఆడడంతో ఇంగ్లండ్ భారీ స్కోర్ దిశగా పయనించింది. అయితే కివీస్ స్పిన్నర్ ఐష్ సోధి తన స్పిన్ మాయాజాలంతో 3 వరుస వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ భారీ స్కోర్ ఆశలకు గండి పడింది. తొలుత డేవిడ్ మలాన్(11), ఆతర్వాత ఇయాన్ మోర్గాన్(10)లను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపిన సోధి.. జట్టు స్కోర్ 102 పరుగల వద్ద నుండగా బట్లర్‌ను కూడా ఔట్ చేశాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన లివింగ్‌స్టోన్(1)ను.. గ్లెన్ ఫిలిప్ క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ తమ ఐదో వికెట్‌ను కోల్పోయింది. 15 ఓవర్ల తర్వాత ఇంగ్లండ్ స్కోర్ 109/5. క్రీజ్లో సామ్ బిలింగ్స్(1), జానీ బెయిర్‌స్టో(7) ఉన్నారు. అబుదాబీ: టీ20 ప్రపంచకప్-2021లో భాగంగా జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లలో ఇవాళ న్యూజిలాండ్-ఇంగ్లండ్ జట్లు తలపడుతున్నాయి. మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తుది జట్లు: న్యూజిలాండ్: మార్టిన్ గప్తిల్, డారిల్ మిచెల్, కేన్ విలియమ్సన్, డెవాన్ కాన్వే, టిమ్ సీఫర్ట్, గ్లెన్ ఫిలిప్, జేమ్స్ నీషమ్, మిచెల్ సాట్నర్, టిమ్ సౌథీ, కైల్ జేమీసన్, ఐష్ సోథీ,టాడ్ ఆస్టల్, ట్రెంట్ బౌల్ట్, మార్క్ చాప్‌మన్, లోకి ఫెర్గూసన్.

ఇంగ్లండ్: జేసన్ రాయ్, జోస్ బట్లర్(కెప్టెన్), డేవిడ్ మలన్, జానీ బెయిర్‌స్టో, లియామ్ లివింగ్‌స్టోన్, ఇయాన్ మోర్గాన్, సామ్ బిలింగ్స్, క్రిస్ వోక్స్, క్రిస్ జోర్డాన్, తైమాల్ మిల్స్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**